# సాక్షి ప్రకాశం

శనివారం । 27 । ఏప్రిల్ । 2024






### భద్రత పటిష్టంగా ఉండాలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రత పటిష్టంగా ఉండాలని ఒంగోలు పార్లమెంట్ పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్ అన్నారు.

- 8లో..



### టీడీపీ రోడ్‌షోకు జనం కరువాయె

టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట పీసీపల్లిలో నిర్వహించిన రోడ్‌షోలో జనం కరువయ్యారు.

- 8లో..

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
42/28

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కబోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### నేడు పాలిసెట్

**ఒంగోలు:** పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ జిల్లా కన్వీనర్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ తెలిపారు. మొత్తం 5 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, వీరికోసం ఒంగోలులో 8, మార్కాపురంలో 4 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు హాల్‌టికెట్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్ మాత్రమే అనుమతిస్తారన్నారు. విద్యార్థులు నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని సూచించారు.

### రీవాల్యుయేషన్‌కు మే 4లోపు దరఖాస్తు చేసుకోవాలి

**ఒంగోలు:** బీపీ ఈడీ, డీపీఈడీ విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం మే 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి కేవీఎన్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థినీ విద్యార్థులు రీ వాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్, జవాబు పత్రాల నకలు కోసం ఈనెల 29 నుంచి మే 4లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీ వాల్యుయేషన్ కోసం ప్రతి పేపర్‌కు రూ.1240, జవాబు పత్రాల జెరాక్స్ కోసం రూ.1700 చెల్లించాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

### వీఆర్‌ఏ ప్రసాద్ సస్పెన్షన్

**పొదిలి:** ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ పచ్చ కండువా మెడలో వేసుకుని టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్ ర్యాలీలో జువ్వలేరు వీఆర్‌ఏ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ విషయమై 26వ తేదీన సాక్షిలో వార్త ప్రచురించారు. స్పందించిన తహసీల్దార్ మహ్మద్ జియా వీఆర్‌ఓ ప్రసాద్ ప్రవర్తనపై విచారణ చేయించారు. పాల్గొన్నారనే విషయం ధ్రువీకరించుకొని సస్పెండ్ చేశారు.

# ప్యాకేజీ వార్

తన ఆధిపత్యం కోసం నిన్నటి వరకు జనసేనలో వర్గ విభేదాలు, కుమ్ములాటలకు నిప్పు రాజేసిన టీడీపీ నేత దామచర్ల తాజాగా ప్యాకేజీ చిచ్చు రగిల్చి ఆజ్యం పోశారు. పార్టీ నేతల మధ్య వైరం సృష్టించి.. మహిళా నేతపై దాడికి పాల్పడేలా వెనుక నుంచి మంత్రాంగం నడిపించారు. పార్టీ అధ్యక్షుడికి ప్యాకేజీ ఇచ్చినట్లు లీకేజీలు ఇచ్చి నేతల మధ్య అగాధం తవ్వారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఇద్దరు నేతల మధ్య సామాజిక మాధ్యమాల కేంద్రంగా వార్ నడుస్తోంది. ఆ పార్టీలో ఇప్పటికే ఆధిపత్య పోరుతో కార్యకర్తలు సతమతమవుతుంటే తాజాగా ప్యాకేజీ పేరుతో నడుస్తున్న కొట్లాట ఆ పార్టీ కేడర్‌ను మరింత గందరగోళానికి నెట్టేస్తోంది.

- సేనలో వివాదానికి ఆజ్యం పోసిన దామచర్ల
- జనసేనలో రియాజ్, రమేష్ వర్గాల మధ్య చిచ్చు
- సామాజిక మాధ్యమాల వేదికగా సవాళ్లు, ప్రతి సవాళ్లు
- ఇప్పటికే అరుణపై దాడి చేసిన రియాజ్ వర్గం
- మహిళా నాయకురాలిపై దాడిచేసినా పట్టించుకోని అధిష్టానం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జనసేన-పవన్ కళ్యాణ్ పేరు వింటే వెంటనే గుర్తుకు వచ్చేది ప్యాకేజీ. అదే ప్యాకేజీ జిల్లా గ్లాసు పార్టీలో చిచ్చురేపుతోంది. పార్టీలో ఉన్న నలుగురు నేతల మధ్య సమన్వయం కొరవడడంతో ఒకరి మీద ఒకరు కారాలు మిరియాలు నూరుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ పొత్తులో భాగంగా జనసేన పార్టీకి జిల్లాలో మొండిచేయి మిగిలింది. కనీసం రెండు సీట్లు వస్తాయన్న ఆశతో ఉన్న నేతలకు నిరాశే మిగిలింది. పొత్తు పేరుతో అన్యాయం జరగడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు డీలా పడిపోయారు. ఇదిలా ఉంటే జిల్లా కేంద్రంలో గ్లాసుపార్టీలో ముఖ్యనేతల మధ్య గ్రూపు తగాదాలతో పరిస్థితి మరింత గందరగోళంగా తయారైంది. నిన్నమొన్నటి వరకు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మధ్య ఆధిపత్య పోరు నడిచింది. అది దాడులు చేసుకునే వరకూ వెళ్లింది. తెలుగుదేశం పార్టీ నాయకుడు, ప్రస్తుత ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌ను ప్రోత్సహించి గ్రూపు వివాదాలకు ఆజ్యం పోశారన్న ప్రచారం జోరుగా సాగింది. ఇదే క్రమంలో రెచ్చిపోయిన రియాజ్ వర్గం పార్టీ అధికార ప్రతినిధి రాయపాటి అరుణను వెంటాడి మరీ దాడులు చేశారు. దీనిని పార్టీ అధినాయకత్వం కనీసం ఖండించలేదు సరికదా ఎన్నికల బిజీలో ఉన్నామని, తర్వాత ఈ విషయాన్ని చూస్తామని చెప్పడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆమె జిల్లాలో దూరంగా ఉంటున్నారు. ప్రచారంలో ఎక్కడా పాల్గొనడం లేదు.

పైకి రియాజ్‌తో రాసుకొని పూసుకొని తిరుగుతున్నట్లు నటిస్తున్న దామచర్ల ఒక వ్యూహం ప్రకారం గ్లాసు పార్టీలో విభేదాలను సృష్టించడం ద్వారా రియాజ్‌ను ఒంటరిని చేసి అతడిని తన చెప్పు చేతుల్లోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా ఒంగోలు నుంచి రియాజ్ పోటీ చేసి ఓటమి చెందాడు. అప్పటి నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని అడపాదడపా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. 2024 ఎన్నికల్లో ఒంగోలు సీటు ఇస్తానంటూ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను గుడ్డిగా నమ్మిన రియాజ్ చివరికి పొత్తులలో చిత్తయిపోయాడు. పవన్ కళ్యాణ్‌ను నమ్ముకున్నందుకు ఈ సారి ఎన్నికలలో పోటీ చేయకుండానే ఓటమి పాలయ్యానని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

**ప్యాకేజీ పేరుతో చిచ్చు**

టీడీపీతో పొత్తులో భాగంగా ఒంగోలు సీటును దామచర్ల జనార్దన్‌కు కేటాయించడంతో ఆ సీటుపై ఆశలు పెట్టుకున్న రియాజ్ షాక్‌కు గురయ్యారు. కొద్ది రోజులపాటు ఆయన అజ్ఞాతంలోకి వెళ్లి పోయారు. తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేయడంతో ఆయన అనుచరులకు కూడా అందుబాటులోకి లేకుండా పోయారు. అయితే కొద్ది రోజుల తరువాత రియాజ్‌కు న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో ఆయన తిరిగి కూటమి కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలెట్టారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో గత కొన్ని రోజుల నుంచి తన సంగతి తేల్చమంటూ రియాజ్ పట్టుబడుతున్నాడు. ఐదేళ్లుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నానని, అందుకోసం తన చేతి డబ్బులను ఖర్చు చేయడమే కాకుండా అప్పులు కూడా చేశానని చెప్పిన రియాజ్ తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో దామచర్ల, రియాజ్‌ల మధ్య రాజీకుదిరి ప్యాకేజీ కూడా అందినట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయం బహిర్గతం కావడంతో పార్టీ నగర అధ్యక్షుడు రమేష్ అగ్గిమీద గుగ్గిలం అయినట్టు సమాచారం. ఇంత కాలం పార్టీని తాము సైతం సొంత డబ్బులతో మోశామని.. ప్యాకేజీలో తనకూ వాటా ఇవ్వాలని రియాజ్‌ను నిలదీసినట్టు తెలిసింది. చివరికి ఈ వివాదం చినికి చినికి గాలివానగా మారింది. రియాజ్, రమేష్ వర్గాలు సోషల్ మీడియాలో సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకునే వరకూ వెళ్లారు. ఇదిలా ఉండగా పార్టీలో జరుగుతున్న పరిణామాలపై విసుగుచెందిన నాయకులు పార్టీని వీడుతున్నారు. ఆ పార్టీ నగర కార్యదర్శి షేక్ సుభానీ వైఎస్సార్‌సీపీలో చేరారు. జనార్దన్‌కు ఓటమి తప్పదని హెచ్చరిస్తున్నారు.

### డబ్బుల విషయాన్ని లీక్ చేసిందెవరు ?

రియాజ్, రమేష్ వర్గాల మధ్య చిచ్చుకు కారణమైన డబ్బుల వ్యవహారంలో జనసేన కార్యకర్తలు, నాయకులు అనేక సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో దామచర్ల పాత్రపై జనసైనికులు మండిపడుతున్నారు. నగర కమిటీని పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరి మధ్య అత్యంత రహస్యంగా జరిగిన ఈ డీల్ విషయం ఎవరు లీక్ చేశారన్న అంశంపై రియాజ్ వర్గం ఆరా తీస్తోంది. దామచర్లే లీకువీరుడని సమాచారం. దీంతో ఇప్పటి వరకు కలిసి మెలసి ఉన్న రమేష్ వర్గాల మధ్య గలాటలు మొదలయ్యాయి.

### మూడు ముక్కలాట...

ఎన్నికల పొత్తు కుదరక ముందు జనసేనలో నాయకుల మధ్య అభిప్రాయభేదాలున్నా ఏనాడూ బజారుకెక్కలేదు. గుంభనంగా పార్టీని నడుపుకుంటూ వచ్చారు. ఎప్పుడైతే జనసేన, టీడీపీ మధ్య పొత్తుకు తెరతీసిందో జిల్లా జనసేనలో విభేదాలు ముదరడం మొదలయ్యాయి. పొత్తు కుదిరి జెండాలు కలిసిన తరువాత జనసేన నాయకులు కొట్టుకోవడం వరకు వెళ్లారు. ఇప్పుడు ప్యాకేజీ విషయంలో సోషల్ మీడియా వేదికల మీద లొల్లి చేసుకుంటూ పార్టీ పరువును బజారునపడేస్తున్నారని కొందరు జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో దామచర్ల నారద పాత్రే ఉందని గుస్సాపడుతున్నారు. జనసేన నాయకుల మీద పెత్తనం చెలాయించాలంటే ఆ పార్టీ బలహీనపడాలి. ఆ పార్టీ నాయకులు కొట్టుకుంటూ తన చుట్టూ తిరిగేలా చేసుకోవాలన్న కుట్రలో భాగంగానే జనసేనలో తగవులాటలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అసలు ఎవరి కోసం తాము ఎన్నికల్లో పోరాడాలని, తమకు అందుబాటులో ఉండని దామచర్ల జనార్దన్ కంటే తమకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అవసరమైనప్పుడు అండగా నిలిచే బాలినేని శ్రీనివాసరెడ్డిని గెలిపించుకుంటామని కొందరు జనసేన నాయకులు చెబుతుండడం గమనార్హం.

### జనార్ధన్ నామినేషన్‌కు రియాజ్ ఒక్కడే హాజరు..

టీడీపీ అభ్యర్థిగా దామచర్ల జనార్దన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి రియాజ్ ఒక్కరే హాజరయ్యారని తెలిసింది. నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో గ్లాస్ జెండాలు అక్కడక్కడా కనిపించాయి. వాహనంపై రియాజ్ మాత్రమే కనిపించడం గమనార్హం.

# బాలినేని రోడ్‌షో అదరహో




37 వ డివిజన్ సమతానగర్ ఎన్నికల ప్రచార రోడ్‌షోలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రోడ్‌షోకు హాజరైన ప్రజలు

- ప్రతి ఇంటి వద్ద ఆత్మీయ స్వాగతం
- సోనియాగాంధీనగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన బాలినేని

**ఒంగోలు:** స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రోడ్‌షో అదరహో అనిపించింది. స్థానిక 36,37, 38 46,47 డివిజన్లలో శుక్రవారం ఆయన రోడ్‌షో ద్వారా ప్రజలకు అభివాదం చేసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున బాలినేనికి స్వాగతం పలికారు. వాహనాన్ని ప్రతి ఇంటి వద్ద నిలిపి మరీ మహిళలు దిష్టితీసి హారతులిచ్చారు. వాసన్నకు జై అనే నినాదాలతో సమతానగర్, సుజాతానగర్‌లు హోరెత్తాయి. ఈ సందర్భంగా స్థానిక సోనియాగాంధీ నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను ఇంతగా అభిమానిస్తున్న ప్రజల ఆదరాభిమానాన్ని తాను మరిచిపోలేనన్నారు. 37వ డివిజన్‌లో అభివృద్ధి బాధ్యత తాను స్వయంగా పర్యవేక్షిస్తానని ప్రజలకు మాట ఇచ్చారు. నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, అందులో భాగంగా నగరంలో దోమల బెడద నివారించాలంటే అందుకు ముఖ్యమైన మార్గం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అన్నారు. అందుకు తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. 20,840 మందికి ఇప్పటికే ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. మరో 4 వేలమందికి కూడా పంపిణీ చేసేందుకు అవసరమైన జాగా ఉందన్నారు. వీటిలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయడమే కాదని, తాము గెలిచిన 9 నెలల్లోనే అక్కడ ఇళ్లు కూడా కట్టించి ఇస్తామన్నారు. కేవలం ఇళ్లు కట్టించి ఇవ్వడమే కాదని, అక్కడ అన్ని రకాల మౌలిక వసతులకు ఇప్పటికే నిధులు కూడా ప్రభుత్వం మంజూరు చేసిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. నగరంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగాలన్నా, పగటి పూటే నీటి పంపిణీ జరగాలన్నా అందుకు పైపులైన్ల ఆధునికీకరణ, అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం తప్పనిసరి అన్నారు. నేడు అందుకు రూ.339 కోట్లతో టెండర్లు కూడా పూర్తయ్యాయని, మరో 9 నెలల్లో వీటి నిర్మాణం కూడా పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. గత ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ఒంగోలు ప్రజానీకం చివరిసారిగా కూడా తనను గెలిపిస్తే అభివృద్ధికి కేరాఫ్ ఒంగోలుగా చేసి చూపిస్తానన్నారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, మాజీ శాసనసభ్యులు కసుకుర్తి ఆదెన్న, 38వ డివిజన్ కన్వీనర్ ఆకుల మోహన్‌రావు, కోఆప్షన్ మెంబర్ వర్ధు శేషయ్య, 37వ డివిజన్ కన్వీనర్ గునుపూడి వెంకారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి గోలి తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బాలిశెట్టి నాగేశ్వరరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, నాయకులు పొటికలపూడి రాము, రాయని వెంకట్రావు, దొంతుల కిషోర్‌నాయుడు, 39వ డివిజన్ కార్పొరేటర్ గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటుకు 25..అసెంబ్లీకి 158 ఓకే..

- నామినేషన్ల పరిశీలన పూర్తి
- పార్లమెంట్‌కు 32 మంది అభ్యర్థులు, 61 నామినేషన్లు దాఖలు
- ఏడుగురివి తిరస్కరించగా, 25 ఆమోదం
- జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 206 మంది 354 నామినేషన్లు దాఖలు
- వాటిలో 48 మందివి తిరస్కరణ, 158 ఆమోదం
- ఈ నెల 25వ తేదీ నాటికి జిల్లాలో ఓటర్లు 18,22,470
- రూ.2,21,90,514 నగదు, మద్యం, డ్రగ్స్ సీజ్



నామినేషన్ల పరిశీలన చేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

**ఒంగోలు అర్బన్:** సార్వత్రిక ఎన్నికల్లో కీలకంగా ఉన్న నామినేషన్ల ఘట్టంలో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన శుక్రవారం పూర్తయింది. ఒంగోలు పార్లమెంటుకు సంబంధించి ఏడుగురి నామినేషన్లు, అసెంబ్లీలకు 48 మంది నామినేషన్లు తిరస్కరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 18 నుంచి 25 వ తేదీ వరకు ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి తిరస్కరించిన, ఆమోదం తెలిపిన నామినేషన్ల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ మీడియాకు వివరించారు. ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉందని, అనంతరం పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితా సిద్ధం చేస్తామన్నారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 32 మంది అభ్యర్థులు 61 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. 32 మందిలో ఏడుగురి నామినేషన్లు తిరస్కరించి 25 మందివి ఆమోదించినట్టు తెలిపారు. వాటిలో రెండు జాతీయ పార్టీలు, 2 రాష్ట్ర పార్టీలు, 5 రిజిస్టర్డైన గుర్తింపులేని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారన్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 206 మంది అభ్యర్థుల నామినేషన్లు వేయగా వాటిలో 48 మందివి తిరస్కరించి 158 మందివి ఆమోదించినట్టు వివరించారు.

**ఓటర్లు 18,22,470:**

జిల్లాలో ఈ నెల 25వ తేదీ వరకూ 18,22,470 మంది ఓటు హక్కు పొందారన్నారు. అందులో 9,07,980 మంది పురుషులు, 9,14,379 మంది మహిళలు, 111 మంది థర్డ్ జెండర్లు ఉన్నట్టు వివరించారు. జిల్లాలో 3,26,572 మందికి సంబంధించిన ఎపిక్ కార్డులు ఇప్పటికే పోస్టు ద్వారా అందజేసినట్టు తెలిపారు. మిగిలిన కార్డులు వేగంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేశామని, వాటిని నియోజకవర్గాలకు తరలించామన్నారు. గుర్తులు పెరిగితే సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహించి ఈవీఎంలు ఏర్పాటు చేస్తామన్నారు. మే 2వ తేదీన రెండో దశ ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఎన్నికల నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ, అనుమతులు మంజూరు వంటివి నిబంధనల ప్రకారం పక్కాగా చేపడుతున్నామన్నారు.

**పక్కాగా నిఘా**

ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పక్కాగా నిఘా ఏర్పాటు చేశామని ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ తెలిపారు. పొరుగు జిల్లాల నుంచి వచ్చే వాహనాలు తనిఖీ చేస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. తనిఖీల్లో రూ.2,21,90,514 విలువజేసే నగదు, మద్యం, డ్రగ్స్ తదితర వస్తువులు సీజ్ చేసినట్లు తెలిపారు. అందులో నగదు రూ.98,01,150 ఉందన్నారు.

**నామినేషన్ల పరిశీలన నియోజకవర్గాల వారీగా వివరాలు**

| నియోజకవర్గం | దాఖలైన నామినేషన్లు | నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల సంఖ్య | తిరస్కరించిన నామినేషన్లు | ఆమోదించిన నామినేషన్లు |
|---|---|---|---|---|
| ఒంగోలు పార్లమెంట్ | 61 | 32 | 7 | 25 |
| యర్రగొండపాలెం అసెంబ్లీ | 43 | 21 | 3 | 18 |
| దర్శి | 43 | 22 | 11 | 11 |
| సంతనూతలపాడు | 35 | 17 | 3 | 14 |
| ఒంగోలు | 61 | 34 | 5 | 29 |
| కొండపి | 47 | 25 | 4 | 21 |
| మార్కాపురం | 44 | 32 | 3 | 29 |
| గిద్దలూరు | 42 | 28 | 4 | 24 |
| కనిగిరి | 39 | 27 | 15 | 12 |
| మొత్తం | 354 | 206 | 48 | 158 |

# 30న టంగుటూరులో సీఎం జగన్ ఎన్నికల సభ

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

**సింగరాయకొండ (మర్రిపూడి):** రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల సభలు ప్రారంభం కాగా ఈనెల 30వ తేదీ టంగుటూరులో ఎన్నికల సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, పార్టీ కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. కొండపి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో టంగుటూరులో జగన్‌మోహన్‌రెడ్డి సభ నిర్వహించి ముఖ్యమంత్రి అయ్యాడని గుర్తు చేశారు. ఈ ప్రకారం ఈసారి టంగుటూరులోనే సభ నిర్వహించేందుకు టంగుటూరు మండల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సభ సక్రమంగా జరిగేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

జగనన్న ప్రభుత్వంలో గ్రామస్థాయిలో చిట్టచివరి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు నిరుపేదలకు సంక్షేమ పథకాలను గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందించామన్నారు. అంతేకాక టంగుటూరులో దళిత సామాజిక వర్గం అధికంగా ఉండగా నియోజకవర్గంలో సుమారు 70 వేలకు పైగా దళిత సామాజికవర్గానికి చెందినవారున్నారన్నారు. జగనన్న రాకకోసం టంగుటూరు ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఈ సభను జయప్రదం చేయాలని కోరుతూ మీడియా ద్వారా ఇదే ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ భారీ సంఖ్యలో సభకు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమానికి కొండపి నియోజకవర్గంతో పాటు కందుకూరు, కనిగిరి నియోజకవర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని, సుమారు 50 వేల మందితో ఈ సభను నిర్వహించనున్నట్లు మంత్రి సురేష్ వివరించారు. విలేకరుల సమావేశంలో మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొన్నలూరు ఎంపీపీ మాధవరావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైస్ ఎంపీపీ వేముల ప్రసాద్, మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మండవ కొండయ్య, మాచేపల్లి నాగయ్య, భోదా రమణారెడ్డి పాల్గొన్నారు.

# సింగిల్‌గా వస్తున్నాడు మన జగనన్న

- మంత్రి మేరుగు నాగార్జున



గుండ్లాపల్లి గ్రామంలో మంత్రి మేరుగు నాగార్జునకు హారతులిస్తున్న మహిళ

**మద్దిపాడు:** వచ్చే ఎన్నికల్లో మన జగనన్న సింగిల్‌గా సింహంలా వస్తున్నాడు.. ఆయనకు మద్దతుగా పేద బడుగు బలహీన వర్గాలు అండగా ఉన్నాయని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని గుండ్లాపల్లి, గార్లపాడు, ఘడియపూడి పునరావాస కాలనీల్లో గురువారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతమంది ఎన్ని జండాలు పట్టుకుని గుంపులుగా వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్‌గానే వస్తున్నాడని అన్నారు. పేదలకు మేలు చేసే తలంపుతో పార్టీ వర్గ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ మేలు చేకూర్చేలా పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో తమ ఓటును ఫ్యాన్ గుర్తు పై రెండు మార్లు నొక్కి ఎంపీగా నందిగం సురేష్‌ను, ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ముందుగా ఆయన గుండ్లాపల్లి గ్రామంలో ప్రవేశించగానే, మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, తేళ్ల పుల్లారావు, రాయపాటి రమేష్, శ్రీకాంత్, అన్వేష్, దుడ్డు వినోద్ పైనం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కొప్పోలు ఆంజనేయులు, దేవరపల్లి గంగిరెడ్డి, బొమ్మల రామాంజనేయులు, ఎంపీటీసీలు పల్లకి పద్మకుమారి, పైనం ప్రభాకర్, గుండ్లాపల్లి గ్రామ నాయకులు లింగా రామకృష్ణారెడ్డి, పల్లకి సత్యన్నారాయణ రెడ్డి, విజయ భాస్కరరెడ్డి, జవ్వాజి లక్ష్మీనారాయణరెడ్డి, ఘడియపూడి, గార్లపాడు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రూ.20 లక్షల నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో అధికారులు

పుల్లలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో రూ.20 లక్షల నగదును అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన పుల్లలచెరువు మండలంలోని మల్లాపాలెం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం జరిగింది. మాచర్లకు చెందిన అజీజ్‌ అనే వ్యక్తి కారులో రూ.20 లక్షల నగదు తీసుకుని ఒంగోలు వెళ్తుండగా, తనిఖీ చేసిన పుల్లలచెరువు ఎస్‌ఐ ఫిరోజ్‌ ఫాతిమా, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారి వి.వెంకటేశ్వరరావు పట్టుకున్నారు. నగదు ఆధారాలు లేకపోవడంతో సీజ్‌ చేసినట్లు వారు తెలిపారు.

### మద్యం మత్తులో దాడి, ఒకరు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాములునాయక్‌

యర్రగొండపాలెం: మద్యం మత్తులో జరిగిన దాడిలో ఒకరు మృతి చెందారు. స్థానిక ఒక ప్రైవేటు వైద్యశాల సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో వెలగల శ్రీనివాసులు (40) అనే వ్యక్తి మరొకరితో కలిసి గురువారం రాత్రి మద్యం సేవించాడు. ఆ సమయంలో వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అక్కడే ఉన్న ఇనుప రాడ్డుతో శ్రీనివాసులు నెత్తిపై కొట్టడంతో అతను మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సీఐ రాములునాయక్‌ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీ ద్వారా నిందితుడిని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆచూకీ కోసం ఒంగోలు నుంచి పోలీసు జాగిలాన్ని రప్పించారు. మృతుడికి భార్య కుమారి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సీఐ ఆర్‌.రాములు నాయక్‌ ఆధ్వర్యంలో ఎస్సై పి.సుదర్శనం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వరిగడ్డి దగ్ధం

త్రిపురాంతకం: ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి వరిగడ్డి దగ్ధమైంది. త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కటికి ప్రసాద్‌ నాలుగు ట్రక్కుల వరిగడ్డిని తన పొలంలో నిల్వ ఉంచగా అగ్నికి ఆహుతైంది. దాంతో సుమారు రూ.65 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. పక్క చేలో ఉన్న పాశ్యపు ఏడుకొండలుకు చెందిన రెండెకరాల వాటర్‌ పైప్‌ కాలిపోయింది. గ్రామసర్పంచ్‌ వెంకట తిరుమలయ్య అధికారులకు సమాచారం అందించారు.

# వ్యాపారులకు అండగా ఉంటాం

- బాపూజీ కాంప్లెక్స్‌లో బాలినేని శచీదేవి, శ్రీకావ్య ఎన్నికల ప్రచారం



బాలినేని శచీదేవి, శ్రీకావ్యలను గజమాలతో సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు



బాపూజీ మార్కెట్‌ కాంప్లెక్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శచీదేవి, బాలినేని శ్రీకావ్య

ఒంగోలు టౌన్‌: పాతికేళ్లపాటు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి తన హయాంలో వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశారని ఆయన సతీమణి బాలినేని శచీదేవి, కోడలు బాలినేని శ్రీకావ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని బాపూజీ మార్కెట్‌ కాంప్లెక్స్‌లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలినేని సోదరి రమణక్క, రేవతక్కతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, వైఎస్సార్‌ సీపీ మహిళా విభాగం నాయకులు, ఆర్యవైశ్య నాయకులతో కలిసి ప్రచారం చేశారు. కాంప్లెక్స్‌లోని ప్రతి దుకాణం వద్దకు వెళ్లి రానున్న ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. వారికి హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి, శ్రీకావ్య మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా బాపూజీ కాంప్లెక్స్‌లోని వ్యాపారులందరికీ అన్నివేళలా బాలినేని అండగా ఉంటారని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. నగరంలోని నిరుపేద ఆర్యవైశ్యులు ఆరామక్షేత్రం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకుని నగరం మధ్యలో ఖరీదైన స్థలాన్ని ఎమ్మెల్యే బాలినేని కేటాయించారని తెలిపారు. సుదీర్ఘ కాలంగా వివాదంలో ఉన్న గోశాల సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు గోమాతలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అంటే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎంతో అభిమానమని, ఆయన మంత్రి వర్గంలో మంత్రిగా పనిచేసిన విషయాన్ని ఎప్పుడూ చెబుతుంటారని తెలిపారు. ఆయన మీద గౌరవంతోనే ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదానికి గురై తీవ్రంగా నష్టపోయిన చందోలు సురేష్‌కు సొంత నిధులతో రూ.10 లక్షలు సహాయం చేశారని చెప్పారు. అలాగే ఇళ్లు లేని నిరుపేద ఆర్యవైశ్యులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని, ఎన్నికల తర్వాత ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇస్తారని భరోసా ఇచ్చారు. బాలినేని లాంటి మానవతావాది, మనసున్న నాయకుడిని వైఎస్సార్‌ సీపీ ఫ్యాన్‌ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్మన్‌ కుప్పం ప్రసాద్‌, బాపూజీ కాంప్లెక్స్‌ అధ్యక్షుడు కోడూరు సత్యనారాయణ, కార్యదర్శి ఎస్‌ఆర్‌ఎంఎస్‌ శ్రీనివాస్‌, కోశాధికారి బియ్యపు వరదరాజు, ఉపాధ్యక్షులు ఇలింద్ర సత్య శ్రీనివాసులు, కమిటి మెంబర్‌ కోడూరు శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు మునగా కృష్ణారావు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, గోశాల కమిటీ అధ్యక్షుడు తడవర్తి వాసు, వైఎస్సార్‌ సీపీ మహిళా నాయకురాళ్లు జి.రమణి, ఏ ప్రత్యూష, ప్రసూన, భాషిణి, టి.సుజాత, కౌసల్య, మాధవి, రాజా, జయంతి పాల్గొన్నారు.

# ఆశీస్సులందించండి..అభివృద్ధి చేస్తా..

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు



జగన్నాథపురంలో ప్రచార రథంపై ఎమ్మెల్యే అన్నా, జంకె, హనుమారెడ్డి తదితరులు

తర్లుపాడు: ఎన్నికల్లో మీ ఆశీస్సులు అందించి ఆదరించి ఓట్లు వేసి గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని జగన్నాథపురం, సీతానాగులవరం, తుమ్మలచెరువులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్‌ జంకె వెంకటరెడ్డి, ఏపీ పొల్యూషన్‌ బోర్డు సభ్యుడు వెన్న హనుమారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతాలకతీతంగా సేవలందించిన సీఎం వైయస్‌ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. పెద్ద మనసుతో ఆలోచన చేసి ఆశీర్వదిస్తే అన్ని వేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. అందరూ బాగుండాలని కోరుకునే వ్యక్తినని, ఫ్యాన్‌ గుర్తుపై ఓటువేసి తనను, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

**చంద్రబాబును ప్రజలు నమ్మరు: జంకె వెంకటరెడ్డి**

14 ఏళ్లు సీఎంగా చంద్రబాబుకు ప్రజలకు చేసింది ఏం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్‌ జంకె వెంకటరెడ్డి అన్నారు. పశ్చిమ ప్రకాశం గురించి చంద్రబాబు పట్టించుకోలేదని మండిపడ్డారు. పశ్చిమ ప్రకాశానికి నీటి సమస్యను తీర్చే వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహించారని ధ్వజమెత్తారు. 2004లో వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి రూ.3500 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. ఆయన మరణానంతరం ప్రాజెక్టు పనులు ఆగిపోయానన్నారు. ప్రజల ఆశీస్సులతో 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌ అధికారంలోనికి వచ్చిన వెంటనే పనులు వేగంగా పూర్తిచేసి జాతికి అంకితం చేశారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కూడా టీడీపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేదల సంక్షేమంకోసం సీఎం వైఎస్‌ జగన్‌ లక్షల కోట్ల రూపాయలను ఖర్చుచేశారన్నారు. బ్రిటీష్‌ కాలంనాటి చుక్కల భూములు, అసైన్‌మెంటు భూములకు సర్వహక్కులు కల్పించి రైతులకు ఉచితంగా పట్టాలు అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ముందుగా జగన్నాథపురంలో సర్పంచ్‌ గంటా వెంకటరెడ్డి, నాయకులు అల్లు వెంకటరెడ్డి, తంగిరాల రవికుమార్‌, రమేష్‌, డేవిడ్‌లు నాయకులకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. సీతానాగులవరంలో సర్పంచ్‌లు ఆంజనేయులు, రమణయ్య, ఎంపీటీసీ రేగుల సాలమ్మ, నాయకులు దానయ్య, అంకయ్యలు స్వాగతం పలికారు. మహిళలు పూలు చల్లుతూ హారతులిచ్చారు. తుమ్మలచెరువులో సర్పంచ్‌ షాజహాన్‌, నాయకులు రావి బాబు తదితరులు నాయకులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్న ఇందిర, వైస్‌ ఎంపీపీలు చెన్నకేశవులు, సుజాత, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు మురారి, జేసీఎస్‌ కన్వీనర్‌ రామాంజనేయరెడ్డి, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌ ఆడిటోరియాన్ని అడ్డుకుంది దామచర్లే

- విలువైన స్థలం దళితులకు ఎందుకివ్వాలంటూ జనార్దన్‌ అడ్డుకున్నాడు
- పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలకూ టీడీపీ నేతలు అడ్డుపడ్డారు
- దళితులు, పేదలకు అండగా నిలిచింది సీఎం జగన్‌, బాలినేనే..
- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య



విలేకరులతో మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య, మేయర్‌ గంగాడ సుజాత, బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్‌ యాదాల అశోక్‌బాబు, యాదాల రాజశేఖర్‌

ఒంగోలు: కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ఒంగోలులో మున్సిపల్‌ ఆడిటోరియం స్థానంలో అంబేడ్కర్‌ ఆడిటోరియం నిర్మించాలని నిధులు మంజూరు చేస్తే దానికి శంకుస్థాపన జరగకుండా తరువాత ఎమ్మెల్యేగా గెలిచిన దామచర్ల జనార్దన్‌రావు అడ్డుకున్నారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య అన్నారు. స్థానిక హోటల్‌ సరోవర్‌ కాన్ఫరెన్స్‌ హాలులో శుక్రవారం ప్రస్తుత ఎన్నికల్లో మాల మహానాడు ఎటువైపు అనే దానిపై మాలల ఆత్మీయ సదస్సు నిర్వహించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. విలువైన స్థలం దళితులకు ఎందుకివ్వాలంటూ దానిని స్టడీ సర్కిల్‌ కింద మారుస్తామంటూ ఆపేసిన ఘనత దామచర్లది అన్నారు. దళితుల పట్ల చంద్రబాబుకైనా, స్థానిక మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ఏమాత్రం ప్రేమ ఉన్నా కరోనా సమయంలో పేద ప్రజలను ఎందుకు పట్టించుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉండేవారే నాయకులని, కరోనా సోకినా సొంత డబ్బులు వెచ్చించి అండగా నిలిచిన బాలినేని శ్రీనివాసరెడ్డి, కరోనా మహమ్మారి నుంచి ప్రజలను కాపాడుకునేందుకు సీఎం వైఎస్‌ జగన్‌ కల్పించిన ధైర్యం, అందించిన సేవలకు ఆకర్షితులమై తాము అంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నామన్నారు. ఒంగోలులో టీడీపీ హయాంలో సెంటు భూమి కూడా ప్రజలకు ఇవ్వలేదని, మరో వైపు పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే కోర్టుకు వెళ్లి అడ్డుకోవడంలోనే టీడీపీ వైఖరి ఏంటో తెలిసిపోయిందన్నారు. నగర మేయర్‌ గంగాడ సుజాత మాట్లాడుతూ ఎస్సీలు అందరినీ కారంచేడు ఘటన ఐక్యం చేసిందన్నారు. వర్గీకరణ పేరుతో చిచ్చుపెట్టాలని చంద్రబాబు చేసిన యత్నాలు సక్సెస్‌ కాలేదన్నారు. నామినేటెడ్‌ పదవులు కావొచ్చు, సంక్షేమ పథకాలు కావొచ్చు అత్యధికంగా దళిత బహుజనులు అందుకున్నది ఈ ప్రభుత్వంలోనే అన్నారు. టీడీపీ అహంభావానికి, వైఎస్సార్‌ సీపీ ఆత్మీయతకు మధ్య తేడా ప్రతి ఒక్కరికీ తెలుసని అందుకే ఈ దఫా ఎన్నికల్లోనూ టీడీపీకి గుణపాఠం తప్పదన్నారు.

వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రత్యేక అధికారి డాక్టర్‌ యాదాల అశోక్‌బాబు మాట్లాడుతూ కూడు, వస్త్రం, విద్య, వైద్యం అందినప్పుడే నా జాతి అభివృద్ధి అని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ పేర్కొన్నారని, అవన్నీ అందుతున్నది ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అన్నారు. ఆపద వస్తే అందరికీ దేవుడు గుర్తుకు వస్తారని, కానీ ఒంగోలులో కుల మతాలకు అతీతంగా ప్రతి పేదవాని గుండె వాసన్న అనే కొట్టుకుంటుందన్నారు. వాసన్న ఇంటికి వెళ్లి సమస్యలను చెప్పుకున్నట్లుగా నేడు ఓట్లు అడిగేందుకు వస్తున్న పెత్తందారుల బెడ్‌రూముల లోకి వెళ్లడం సాధ్యం అవుతుందా అనేది ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

మాజీ కౌన్సిలర్‌, 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్న యాదాల రాజశేఖర్‌ మాట్లాడుతూ వాసన్న మంచితనం, ఆప్యాయతను ఎవరూ మరువలేరన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎస్సీలు అంతా ఒక వైపే ఉన్నారని, నాడు ఇందిరాగాంధీకి అండగా నిలిస్తే నేడు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. ఎవరు ఎన్ని అనుకున్నా విజయం వైఎస్సార్‌సీపీదే అని, ఆరోసారి బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడం ఖాయం అన్నారు. సమావేశంలో భాగంగా కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌ సీపీ యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌ సీపీకి, ఒంగోలులో తన తండ్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గెలుపునకు మాలమహానాడు మద్దతు ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా 2 లక్షల పనిదినాలు

- డ్వామా పీడీ అర్జునరావు



కనపర్తిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ అర్జున్‌రావు, అధికారులు

మద్దిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా కూలీలకు 2 లక్షల పనిదినాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ బి.అర్జునరావు తెలిపారు. శుక్రవారం ఉదయం మద్దిపాడు మండలంలోని నేలటూరు పంచాయతీ పరిధిలో డగౌట్‌ పాండ్‌ (కొత్త నీటి కుంట) నిర్మాణ పనులన ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ.280కి తగ్గకుండా కూలి వచ్చే విధంగా ఫీల్డ్‌ అసిస్టెంట్లు పని కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు నీడ ఏర్పాటు చేయాలని, తాగు నీరు, ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. పని ప్రదేశాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ పి.వెంకటస్వామి, ఏపీఓ ధనంజయవర్మ, జేఈ కిషోర్‌ కుమార్‌, ప్రసాద్‌, టెక్నికల్‌ అసిస్టెంట్లు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు, ఇతర ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

**కనపర్తి పంచాయతీ పరిధిలో...**

నాగులుప్పలపాడు: మండలంలోని కనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఫిష్‌ పాండ్‌ పనులను డ్వామా పీడీ అర్జునరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పని చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ప్రతిరోజూ ఒక్కో కూలీకి ప్రభుత్వం కొలతల ప్రకారం పనిచేస్తే రూ.300 వేతనం వస్తుందని తెలిపారు. కూలీలంతా క్రమం తప్పకుండా ప్రతిరోజూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కూలీలతో సిబ్బంది పనిచేయించాలని ఆదేశించారు. ప్రతి కూలీ ఉదయం 6 గంటలకే పని ప్రదేశంలో ఉండేలా చూడాలన్నారు. మస్టర్‌లో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లేబర్‌ను పెంచాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ పి.వెంకటస్వామి, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, ఏపీవో రవి, ఈసీ విజయలక్ష్మి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

# భద్రత పటిష్టంగా ఉండాలి

- చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేపట్టాలి
- ఏ ఒక్క వాహనాన్నీ వదిలిపెట్టొద్దు
- 24 గంటల పాటూ స్ట్రాంగ్‌ రూముల వద్ద పహారా కొనసాగాలి
- చెక్‌పోస్టులు, స్ట్రాంగ్‌ రూములను తనిఖీ చేసిన ఒంగోలు పార్లమెంట్‌ పోలీస్‌ అబ్జర్వర్‌, డీఐజీ హసీబ్‌ ఉర్‌ రెహమాన్‌



స్ట్రాంగ్‌ రూమును పరిశీలించి సూచనలిస్తున్న పోలీస్‌ అబ్జర్వర్‌, డీఐజీ హసీబ్‌ ఉర్‌ రెహమాన్‌

ఒంగోలు సబర్బన్‌/మద్దిపాడు: సార్వత్రిక ఎన్నికలు–2024 నేపథ్యంలో భద్రత పటిష్టంగా ఉండాలని ఒంగోలు పార్లమెంట్‌ పోలీస్‌ అబ్జర్వర్‌, డీఐజీ హసీబ్‌ ఉర్‌ రెహమాన్‌ ఆదేశించారు. జిల్లాలోని రహదారులపై ఉన్న చెక్‌పోస్టులు, ఈవీఎంల స్ట్రాంగ్‌ రూములను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. స్థానిక రైజ్‌ ఇంజినీరింగ్‌ కాలేజీలోని స్ట్రాంగ్‌ రూమును, కౌంటింగ్‌ కేంద్రాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్‌ రూముల వద్ద సీసీ కెమేరాల ఏర్పాటు, భద్రతా గార్డ్స్‌ను తనిఖీ చేశారు. భద్రతకు సంబంధించి పలు ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్‌ రూముల వద్ద భద్రత నిర్వహణలో తీసుకున్న జాగ్రత్తలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలు పూర్తయ్యేంత వరకు భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిధులు నిర్వహించాలన్నారు. అనంతరం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గ్రోత్‌ సెంటర్‌ వద్ద ఉన్న చెక్‌పోస్టును తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల వద్ద నిర్వహిస్తున్న రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, 24 గంటల పాటు సీసీ కెమేరాల నిఘాలో ఉండాలని స్పష్టం చేశారు. ఆ ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా పోలీస్‌ హెడ్‌ క్వార్టర్‌లో ఉన్న కంట్రోల్‌ రూంకు అనుసంధానం చేయాలన్నారు. అక్రమంగా మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు సరఫరా కాకుండా చూడాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా జిల్లా ప్రజలు పోలీస్‌ అబ్జర్వర్‌ను కలిసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. శాంతి భద్రతలపై ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తన ఫోన్‌ నంబర్‌ 92810 34495కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఫోన్‌ చేసి ఫిర్యాదులు తెలపవచ్చని చెప్పారు. పోలీస్‌ అబ్జర్వర్‌తో పాటు ఏఆర్‌ ఏఎస్పీ అశోక్‌బాబు, సింగరాయకొండ సీఐ రంగనాథ్‌, జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వర్లు, మద్దిపాడు ఎస్సై మహేష్‌, పలువురు అధికారులు ఉన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- ఎస్పీ గరుడ్‌ సుమిత్‌ సునీల్‌
- టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఆకస్మిక తనిఖీ
- స్టేషన్‌లో ఎన్నికలకు సంబంధించిన కేసులపై ఆరా



టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సుమిత్‌ గరుడ్‌

ఒంగోలు సబర్బన్‌: ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలి ఎస్పీ గరుడ్‌ సుమిత్‌ సునీల్‌ సూచించారు. నగరంలోని టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌ పరిసరాలు, స్టేషన్‌లోపల, స్టేషన్‌ ముందు ట్రాఫిక్‌ పరిస్థితిని పరిశీలించారు. స్టేషన్‌లోని సిబ్బంది ఎక్కడెక్కడ ఎవరు ఉన్నారంటూ సీఐ ఎస్‌ జగదీష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో గత ఎన్నికలకు సంబంధించిన కేసుల వివరాలను రాబట్టారు. 2019 ఎన్నికల సమయంలో టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ముందు కమ్మపాలెంకు చెందిన టీడీపీ ఆందోళన, నిరసన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు ఏ పోలీస్‌ స్టేషన్‌కు వస్తానో తనకే తెలియదని, ప్రతి పోలీస్‌ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

# నూర్‌బాషాలను ఓటు బ్యాంకుగా వాడుకుంది చంద్రబాబే

- నూర్‌బాషా (దూదేకుల) ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ సయ్యద్‌ బాజీ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ షేక్‌ సయ్యద్‌ బాజీ

యర్రగొండపాలెం: చంద్రబాబు నూర్‌ బాష ముస్లిం మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నాడని, తమ వర్గీయుల సంక్షేమం, సమస్యల గురించి ఏనాడూ పట్టించుకోలేదని నూర్‌బాష (దూదేకుల) ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ షేక్‌ సయ్యద్‌ బాజీ అన్నారు. స్థానిక వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఒక కూటమిగా ఏర్పడి సింగిల్‌గా వస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై పోటీకి దిగుతున్నారన్నారు. తామందరం రాష్ట్రంలో ప్రశాంతమైన జీవితం గడుపుతున్నామని, జగనన్న పాలనలో ఎటువంటి దాడులు లేవని, ఎటువంటి అరాచక పరిస్థితులు లేకుండా ప్రశాంత జీవితం గడుపుతున్నామని చెప్పారు. ముస్లిం మైనారిటీలు, క్రిష్టియన్‌ మైనారిటీలకు హాని కలిగించే బీజేపీతో పొత్తుపెట్టుకొని తమ జీవితాలను విచ్ఛిన్నం చేయటానికి చంద్రబాబు పూనుకున్నాడని విమర్శించారు. ఆయనకు బుద్ధి చెప్పేందుకు ముస్లింలు, క్రిష్టియన్‌లు సిద్ధమయ్యారని, జగనన్నకు రాష్ట్రంలో 175 అసెంబ్లీ సీట్లకు 175 సీట్లు ఇవ్వటానికి తామందరం కలిసికట్టుగా ముందుకెళ్లాలని అన్నారు. మైనార్టీలు ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాలని.. జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముగ్గురు ముస్లిం మైనార్టీ వర్గీయులకు టికెట్‌ ఇచ్చి చంద్రబాబు చేతులు దులుపుకున్నాడని, జగనన్న ఏడుగురికి టికెట్‌ ఇచ్చి నూర్‌బాష ముస్లిం మైనార్టీ వర్గీయులను గౌరవించారని చెప్పారు. దూదేకుల, పింజారి అని హేళనగా మాట్లాడి తమ వర్గీయులను కించపరచకుండా జగన్‌మోహన్‌రెడ్డి జీవోను తీసుకొని వచ్చారని, ఆయనకు కృతజ్ఞతగా తామందరం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకొని మరిన్ని అవకాశాలు పొందాలన్న పట్టుదలతో ఉన్నామని చెప్పారు. ఫ్యాన్‌ గుర్తుపై ఓటువేసి యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్‌ కో ఆప్షన్‌ సభ్యుడు సయ్యద్‌ షాబీర్‌బాష, నాయకులు షేక్‌.కరీముల్లా, ఎం.బాబు, షేక్‌.వలి, షేక్‌.కాశిం, డి.నాసర్‌హుసేన్‌, షేక్‌ నాసర్‌వలి, కె.బాబులు, కె.సిద్ధయ్య, డి.నరసింహులు, డి.గిరి, షేక్‌.యూసఫ్‌, డి.కాశయ్య, డి.నాగూర్‌వలి, డి.కాశింవలి, షేక్‌.నసీరుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రోడ్‌ షోకు జనం కరువాయే



పీసీ పల్లి: మాగుంట రోడ్‌ షోకు కరువైన జనం

పీసీపల్లి: మండలంలోని అలవపాడు, పీసీపల్లి, ఇర్లపాడులలో టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి రోడ్‌షో అట్టర్‌ఫ్లాప్‌ అయింది. మాగుంట రోడ్‌షోకు భారీగా ప్రజలు ఆశించగా..పదుల సంఖ్యలో కూడా హాజరు కాకపోవడంపై ఉగ్రకు భంగపాటుకు ఎదురైంది. ఉదయం నుంచి మద్యాన్ని ఏరులై పారించినా తెలుగు తమ్ముళ్లు రోడ్‌షో పట్ల ఆసక్తి చూపలేదు. దీంతో వచ్చిన జనాన్ని చూసి మాగుంట అసహనం వ్యక్తం చేశారు. దీనికి తోడు టీడీపీ మండల అధ్యక్ష పదవి కోసం ఆశిస్తున్న వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న, ఏనుగుంట శ్రీనును వర్గాలు వీడిపోవడంతో మండలంలో పార్టీని పట్టించుకునే వారే కరువయ్యారు. మాగుంట రోడ్‌షోకు పెద్ద జనం వస్తారని స్థానిక నేతలు ప్రచారం చేశారు. కానీ రోడ్‌షోకు వచ్చిన జనాన్ని చూసి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉగ్ర నరసింహారెడ్డిపై అసంతృప్తి వ్యక్తం చేశారు.